'ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం'

అఫ్జల్‌గంజ్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని మాజీ హోంమంత్రి మహమూద్ అలీ ఆరోపించారు. పోలీసుల దాడిలో గాయాలపాలై ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆశా వర్కర్లను మహిళా పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియాలో చేర్పించారు. గత కొన్ని రోజులుగా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆశాలు కోఠిలోని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో వద్ద ఆందోళ చేస్తున్న విషయం తెలిసిందే. ఆందోళన చేస్తున్న వారిలో అనారోగ్యం పాలై, పోలీసుల దాడిలో గాయాలపాలైన ఆశా వర్కర్లను


మాట్లాడుతున్న మహమూద్ అలీ

రాష్ట్ర మాజీ మంత్రులు మహమూద్ అలీ, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించారు.

జీఎన్ఐటీఎస్‌లో 'అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభం


కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సోమవారం ప్రారంభమైంది. రెండు వారాల పాటు జరిగే జాతీయ స్థాయి కార్యక్రమంలో ఎన్‌హాన్సింగ్ డయగ్నొస్టిక్ ప్రెషిషన్, డీప్ లర్నింగ్ పవర్స్, ఇంటలిజెంట్ సిస్టమ్ ఫర్ రెటీనా, అక్లూజన్ డయగ్నొస్టిక్ తదితర అంశాలపై జరుగుతున్న ఈ జాతీయ స్థాయి కార్యక్రమంలో కంటి సంబంధిత నిపుణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్‌రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ జి.మాలినిదేవి, డాక్టర్ డి.వి.ఎల్.పరమేశ్వరి, వై.శ్రావణి దేవి, అటల్ ఎఫ్‌డీపీ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి చెందిన రత్నం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ అన్నారు. సోమవారం డివిజన్‌లోని ఎస్ఆర్టీ కాలనీ, సూపర్ బజార్ ప్రాంతాల్లో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బస్తీల్లో పర్యటిస్తూ ప్రధాన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటికే డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్, సీసీ రోడ్డు, నాలాల విస్తరణ పనులను చేపట్టామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ వసీముద్దీన్, నాయకులు మహ్మద్ గౌస్, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

యేసుబుకు అతి ఉత్కృష్ట సేవా పతకం

అబిడ్స్: మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్.యేసుబుకు అతి ఉత్కృష్ట సేవా పతకం లభించింది. 25 ఏళ్లుగా నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో పనిచేసిన యేసుబు ఉత్తమ ప్రతిభకు అతి ఉత్కృష్ట సేవా పతకాన్ని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రకటించారు. సోమవారం గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకటరెడ్డి, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్ ఆయనకు సేవా పతకాన్ని అందజేసి అభినందించారు.


సేవా పతకం అందజేస్తున్న ఏసీపీ కోట్ల వెంకటరెడ్డి, ఇన్‌స్పెక్టర్ మహేష్

అన్నదానం



గోల్కొండ: గుడిమల్కాపూర్ మార్కెట్ వద్ద కె.వి.వసంతమ్మ బృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రతి నెలా 2వ వారంలో మార్కెట్ ముందు మార్కెట్‌కు వచ్చిపోయేవారికి అన్నదానం చేస్తారు. ఈ సందర్భంగా వసంతమ్మ మాట్లాడుతూ..ప్రతి నెలా అన్నదాన కార్యక్రమం చేపడుతామని పేర్కొన్నారు.

కుష్టు రహిత సమాజానికి ఆశా వర్కర్ల కృషి హర్షణీయం

జియాగూడ: కుష్టు రహిత సమాజానికి ఆశా వర్కర్లు చేస్తున్న కృషి హర్షణీయమని మినిస్ట్రీ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ హరికృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం జియాగూడలోని 2బీహెచ్‌కే, సంజయ్‌నగర్‌లోని పన్నీపురా యూహెచ్‌పీ ఆధ్వర్యంలో ఏర్పాటైన కుష్టువ్యాధి గ్రస్థుల గుర్తింపు ఉద్యమంలో భాగంగా ప్రచారం చేస్తూ బస్తీల్లో పర్యటించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పన్నీపురా ఆశా వర్కర్లు ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించడంలో ప్రత్యేక కృషి చేస్తున్నారు. లిప్రోజీ ఫ్రీ తెలంగాణ దిశగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ జి.బాలకృష్ణ, రాష్ట్ర లిప్రోసి జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు, పన్నీపురా ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ శశికళ, మెడికల్ ఆఫీసర్ మహ్మద్ తౌఫిక్, స్థానిక నాయకులు దర్పల్లి నర్సింహ, కె.నర్సింగ్‌రావు, పీఎంఓ వనిత, హిందూ కుష్టు నివారన్ సంఘ్ సెక్రెటరీ జీడీ.నాయుడు, పన్నీపురా ఏఎన్ఎంలు అమ్మాజీ, ఆశా వర్కర్లు పునీత, స్వాతి, సంధ్యా, లలిత, లక్ష్మీబాయి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ టీమ్‌లీడర్ డాక్టర్ హరికృష్ణ తదితరులు

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

పంజగుట్ట: గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఒక్క సంవత్సరంలోనే 42 మంది వివిధ కారణాల వల్ల చనిపోవడం బాధాకరమని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు మచ్చ నర్సయ్య కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 1009 వివిధ గురుకులాలు ఉన్నాయని నిత్యం ఏదో ఒక ఘటన జరగటం బాధాకరమన్నారు. ముఖ్యంగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందటం లేదన్నారు. పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయడంతోపాటు, మూడు నెలల బిల్లులు అడ్వాన్స్‌గా చెల్లించాలన్నారు. చాలా గురుకులాలు అద్దెభవనాల్లో అరకొర వసతులతో ఉన్నాయని, అన్నింటికీ సొంత భవనాలు నిర్మించాలని కోరారు. గురుకులాల కొత్త చైర్మన్ తల్లిదండ్రులు పిల్లల్ని కలవకూడదు అని జీవో తీసుకువచ్చారని దాన్ని వెంటనే ఉపసంహరించుకుని పిల్లల్ని కలిసే అవకాశం కల్పించాలని కోరారు. అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులతో పాఠశాల యాజమాన్య కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి ఎస్.వెంకటేశ్, మెట్ల శంకర్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

డాగర్‌తో సంచరిస్తున్న యువకుడి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: డాగర్‌తో సంచరిస్తున్న యువకుడిని దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్రినాక ప్రాంతానికి చెందిన జి.అజయ్ కుమార్(30) మూడు నెలల క్రితం ఆన్‌లైన్‌లో రూ.1600లు వెచ్చించి డాగర్‌ను కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి తన స్నేహితుల బర్త్‌డేలకు హాజరై డాగర్‌ను కేక్ కట్ చేసి, వీడియోలు తీసుకొని ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం డాగర్‌తో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో విశ్వసనీయ సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఛత్రినాక పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి అతన్ని అరెస్ట్ చేశారు. డాగర్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న డాగర్

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. టోలిచౌకి చౌరస్తా వద్ద జరుగుతున్న బాక్స్ డ్రైన్ పనులను పరిశీలించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. వారం రోజుల్లో ఈ పనులన్ని పూర్తి కావాలని ఆయన ఆదేశించారు. అత్యంత బిజీగా ఉండే ఈ చౌరస్తా వద్ద జరుగుతున్న పనులతో పాదచారులతో పాటు వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా తోపుడు బండ్ల వ్యాపారులు గుంతల కారణంగా బండ్లను ముందుకు తీసుకువెళ్ల లేకపోతున్నారన్నారు. అనంతరం ఆయన హకీంపేట్‌లో పర్యటించి ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ.. అన్ని బస్తీల్లో వీడీసీసీ రోడ్లు వేయడానికి తాను పంపిన ప్రతిపాదనలు మంజూరయ్యాయని ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తి చేస్తామన్నారు. ముఖ్యంగా ఇరుకుగా ఉన్న గల్లీల్లో సైతం వీడీసీసీ రోడ్లు ఏర్పాటు చేస్తే స్థానికులకు అనువుగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు హరూన్‌ఫరాన్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

17న తెలుగు కవిత్వ రచనలో శిక్షణ

సుల్తాన్‌బజార్: తెలుగు కవిత్వ రచనలో మెలకువలు బోధించే సంకల్పంతో తెలంగాణ సారస్వత పరిషత్తు ఈ నెల 17న ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ప్రముఖ కవులు ఈ శిబిరంలో పాల్గొని ఔత్సాహికులకు కవితా రచనకు సంబంధించిన అన్ని అంశాలు వివరిస్తారని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో పాల్గొనేందుకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, ఆసక్తి ఉన్నవారు వెంటనే వాట్సాప్ నెం: 96037 27234లో తమ పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

బీఆర్‌టీయూ నాయకులపై కేసు

సుల్తాన్‌బజార్: ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం కోఠి డీఎంహెచ్ఎస్‌లో చేసిన ఆందోళన ఉద్రిక్తత కావడం, ఒకరికి ఒకరు తోసుకోవడంపై సుల్తాన్‌బజార్ పోలీసులు బీఆర్‌టీయూ అధ్యక్షులు రాంబాబుతో సహా మరో 15 మందిపై కేసులు నమోదు చేశారు. పోలీసులపై చెయ్యి చేసుకున్నవారిని వదిలేది లేదని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస చారి తెలిపారు.

నేటి నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

బండ్లగూడ: ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకొని మూడు రోజుల పాటు సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. గండిపేట మండల పరిధిలోని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలోని అన్ని వార్డులలోని యువజన సంఘాల సభ్యులు, పాఠశాలల విద్యార్థులు, కళాశాలల విద్యార్థులు ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొనాలని కోరారు. బండ్లగూడలోని డాన్ బాస్కో పాఠశాలలో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, యోగా తదితర పోటీలు జరుగుతాయన్నారు. మరింత సమాచారం కోసం అధికారులు ఎస్.జోత్స్న (ఫోన్: 94402 31217), అంజనేయులు(ఫోన్: 88977 22301)ను సంప్రదించాలని కోరారు. మున్సిపాలిటీల్లో నిర్వహించిన సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఇందిరమ్మ గృహాలకు ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించటం శుభపరిణామని, వాటిని అర్హులకు మాత్రమే కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు డి.సీతారం, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. ధన్‌రాజ్, మహిళా అధ్యక్షురాలు పి.రూపారెడ్డిలు డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా సమావేశం నిర్వహించి అందరికీ తెలిసేలా ఎంపిక చేయాలన్నారు. ఎంపికలో ఎలాంటి వివక్షకు పాల్పడినా తమ పార్టీ తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు సమస్య పరిష్కరించండి

అత్తాపూర్: రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలం అతున్నారని గోల్డెన్ హైట్స్‌లోని అపార్ట్‌మెంట్‌వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో 50 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు మంజూరైనా ఆ పనులను ప్రారంభించడం లేదన్నారు. రోడ్డు పర్మిషన్ కోసం ఎమ్మెల్యే ఇచ్చిన లెటర్‌పై అధికారులకు పలుమార్లు దృష్టికి తీసుకువెళ్లినా ఈ రోడ్డు పనులను చేపట్టక పోవడంలో ఆంతర్యమేమని ప్రశ్నించారు. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని... వరద నీరు మొత్తం తమ అపార్ట్‌మెంట్‌లోకి వస్తుందన్నారు. దీంతో అపార్ట్‌మెంట్‌కు ఉన్న గేటును పూర్తిగా వాహకాల రాకపోకలకు నిలిపి వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు పనులను చేపట్టి సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

గంజాయి విక్రయిస్తే ఆస్తులు జప్తు చేస్తాం

డీసీపీ చంద్రమోహన్

అబిడ్స్: ధూల్‌పేట్‌లో గంజాయి విక్రయిస్తే ఆస్తులు జప్తు చేస్తామని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ పేర్కొన్నారు. ఆపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా సౌత్ వెస్ట్ పోలీసులతో ఎక్సైజ్ పోలీసులు సోమవారం రాత్రి ధూల్‌పేట్‌లోని పలు ప్రాంతాల్లో 9 టీమ్‌లతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం డీసీపీ చంద్రమోహన్ మాట్లాడుతూ.. ధూల్‌పేట్‌లోని అన్ని ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు వెంటనే మానివేయాలని సూచించారు. ఎవరైనా గంజాయి అమ్మకాలు చేపడితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. పలువురు గంజాయి వ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి, అడిషనల్ ఎస్పీ భాస్కర్, ఇతర పోలీసు, ఎక్సైజ్ అధికారులు అనిల్‌కుమార్ రెడ్డి, కోట్ల వెంకట్‌రెడ్డి, నంద్యాల అంజిరెడ్డి, శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఎక్సైజ్ ధూల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.


ధూల్‌పేట్‌లో తనిఖీలు చేస్తున్న డీసీపీ చంద్రమోహన్, ఖురేషీ

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు తరలిన మహిళలు


బండ్లగూడలో బస్సులను ప్రారంభిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సభకు సోమవారం మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22 డివిజన్ల నుంచి 20 బస్సుల్లో సుమారు వెయ్యి మంది మహిళలు తెలంగాణ తల్లి విగ్రహావిష్కణ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గంధ భరితంగా ప్రధాన రోడ్లు


చెత్త కుప్పలతో అపరిశుభ్రంగా మారిన రోడ్లు



మణికొండ: మణికొండ మున్సిపల్ కేంద్రం నుంచి ఔటర్ సర్వీసు రోడ్డుకు చేరుకునే ప్రధాన రోడ్లన్నీ దుర్గంధ భరితంగా తయారయ్యాయి. నిత్యం వేలాది వాహనాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఆయా రోడ్లకు ఇరువైపులా వేసిన చెత్తాచెదారం ఇతర వ్యర్థాల నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. రోజూ మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు అటువైపు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మణికొండ ల్యాంకోహిల్స్ జీ-సర్కిల్ నుంచి ఔటర్ సర్వీసు రోడ్డు, పుప్పాలగూడ బీరప్ప దేవాలయం నుంచి ఔటర్ సర్వీసు రోడ్డుకు మధ్య కనెక్టింగ్ రోడ్డు ప్రారంభించారు. దాంతో ఐటీ ఉద్యోగులతో పాటు ఇతర పనులపై వెళ్లే వారు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నారు. సదరు రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటే కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. వాటిని నాటినా ఆలనా, పాలనా లేకపోవటంతో అవన్నీ ఎండిపోయాయి. దాంతో రోడ్లకు ఇరువైపులా రాత్రి సమయాల్లో చెత్త, నిర్మాణ వ్యర్థాలను గుర్తు తెలియని వ్యక్తులు తెచ్చి పారబోస్తున్నారు. దాంతో ఆయా రోడ్లు డంపింగ్ కేంద్రాలుగా మారిపోయాయని, అటువైపుగా మణికొండలోకి వచ్చే వారు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అక్కడ చెత్త వేయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బెదిరింపులకు పాల్పడిన ఇద్దరి అరెస్టు

మణికొండ: ఓ ఫంక్షన్ హాల్‌ను తమ అనుచరులతో కలిసి కూల్చివేయటం, అద్దెకు ఉంటున్న వారితో పాటు వాచ్‌మెన్‌ను బెదిరించి దోపిడీ యత్నం చేసిన ఇద్దరిని నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి సమాచారం మేరకు... హైదర్‌షాకోట్‌లోని సాయిరాంనగర్ కాలనీలో ఉన్న ఏపీడీ ఫంక్షన్‌హాల్ స్థలాన్ని అహల్యసింగ్ లీజుకు తీసుకున్నారు. ఆదివారం దాన్ని ఖాళీ చేయాలని గంధంగూడకు చెందిన హరీష్‌గౌడ్, సాయిరాం కాలనీకి చెందిన రాంప్రసాద్‌రావులు వారిపై దౌర్జన్యం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. నిందితులతో పాటు వారి అనుచరులు కొంత మంది ఉన్నారని వారిని గుర్తించి అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు. చట్ట విరుద్ధంగా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని, బాధితులు తమను సంప్రదించాలన్నారు.


పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

అక్రమాలకు పాల్పడుతున్న ఎస్ఎస్‌లను తొలగించాలి

యాకుత్‌పురా: జీహెచ్ఎంసీలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న శానిటరీ సూపర్‌వైజర్లను తక్షణమే తొలగించాలని తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీహెచ్ఎంఈయూ) అధ్యక్షుడు కే. బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కే. వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బాలకృష్ణ ఆధ్వర్యంలో నాయకుల బృందం సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రేటర్ పరిధిలోని పలు సర్కిళ్లలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఎస్ఎస్‌లు తమ ఇష్టానుసారంగా వ్యవరిస్తూ అక్రమాలకు పాల్పాడుతున్నారన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఇవాల్సిన పనిముట్లు ఇవ్వకుండా ఇచ్చినట్లు ప్రభుత్వానికి తప్పుడు లెక్కలు సృష్టించి వాటిని బయటి వ్యక్తులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటన్నారని ఆరోపించారు.

నేడు డాక్టర్ ధనుంజయ్ నాయక్‌కు అవార్డు ప్రదానం



చార్మినార్: డాక్టర్ ఎం.ధనుంజయ్ నాయక్ హ్యూమన్ రైట్స్ ఎక్సలెన్సీ అవార్డు-2024 ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తెలిపారు. 20 ఏళ్లుగా నిర్విరామంగా సమాజ సేవలో న్యాయ సేవలు కొనసాగిస్తూ ప్రజలకు హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ధనుంజయ్ నాయిక్ ఈ ఏడాది హ్యూమన్ రైట్స్ ఎక్సలెన్సీ అవార్డు అందజేయనున్నామన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి మహిళా ఫార్మసీ కాలేజీలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు.

నిలోఫర్‌లో ముగిసిన ప్రజా పాలన విజయోత్సవాలు


కేక్ కట్ చేస్తున్న డాక్టర్ రవికుమార్

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో ప్రజా పాలన విజయోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ వేడుకలను వారం రోజుల పాటు నిర్వహించారు. ఈ వేడుకలు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యాధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున హాజరయ్యారు. అలాగే డాక్టర్ రవికుమార్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నాగజ్యోతి, వినోద్‌కుమార్, విజయ్‌కుమార్, కవిత, సుచిత్ర, పద్మ, అనిత, స్వప్న, జయ, భువనేశ్వర్, నారాయణ, బాబురావు, దామోదర్, శివ, శ్రీకాంత్, సిద్ధార్థ్, రాఘవ, శాలిని పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో మైనార్టీ చైర్మన్ దీపక్ జాన్ తదితరులు

చార్మినార్: రాబోయే క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని పాతబస్తీ నయాపూల్ యూసుఫ్ బజార్‌లోని ఎంబీ బెథానీ చర్చ్ వద్ద క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మైనారిటీ చైర్మన్ దీపక్ జాన్‌తో పాటు పాస్టర్ సీహెచ్. జోయెల్, కె.ఆనంద్, కె.డేవిడ్, డి.సునీల్ తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ


లక్ష్మీనర్సింహస్వామి భక్త సమాజం ఆధ్వర్యంలో..

గోల్కొండ: సబ్జీమండిలోని ఉప్పర్‌బస్తీలోలక్ష్మీనర్సింహస్వామి భక్త సమాజం ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోవింద్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో స్వాములు 41 రోజుల దీక్షలో భాగంగా అయ్యప్ప మాల ధరించిన వారు పాల్గొన్నారు. అయ్యప్ప భక్తిగీతాలు పేటతుల్లి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. గురుస్వామి మెగ్గి గోవింద్, గురుస్వామి శ్రీనాథ్‌సాగర్, కునాల్, రాకేష్, కెమోజు శ్రీనివాస్, మధు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

గన్‌ఫౌండ్రీ: బషీర్‌బాగ్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పలువురు ట్రాన్స్‌జెండర్లు పాలాభిషేకం చేశారు. సీఎం తమను గుర్తించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ట్రాఫిక్ వలంటీర్స్‌గా విధుల్లోకి తీసుకోవడంపై ట్రాన్స్‌జెండర్లు హర్షం వ్యక్తం చేశారు. మహిళలతో సమానంగా మహాలక్ష్మి పథకాన్ని అందిస్తున్నారని, గృహలక్ష్మి పథకం కింద డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో వివక్షకు గురవుతున్న మమ్మల్ని కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తాము అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లు ప్రేమ్ లీలా, సోని, లయ, గౌరీ, శృతి, అను, చిన్ని తదితరులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ట్రాన్స్‌జెండర్లు

ఘనంగా ప్రజా పాలన విజయోత్సవాలు

అఫ్జల్‌గంజ్: ప్రజా పాలన విజయోత్సవాలను ఏఐసీసీ బీసీ సెల్ కోఆర్డినేటర్ నిర్మల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సోవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేశారు.

